క్లుప్తంగా

జీపీ భూములను కాపాడాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామ పంచాయతీ భూములను కాపాడాలంటూ డొంకేశ్వర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాలుగో రోజు కొనసాగాయి. ఈసందర్భగా గ్రామస్తులు మౌన ప్రదర్శన నిర్వహించారు.జీపీ భూములు కబ్జాకు గురికాకుండా అధికారు లు కంచెను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీజేపీ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ద్యాగ ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా పోల్కవేణు, పులియుగేంధర్, ఉపాధ్యక్షులుగా దుగ్గివిజయ్, రాజేశ్వర్, దోండి ప్రకాష్, బోచ్కర్ పద్మ, వివేక్‌నందు, నగేష్, రమేష్, కార్యదర్శులుగా ఖాందేష్ ప్రశాంత్, కుమార్, మిర్యాల్ కిరణ్, చెన్నారెడ్డి, పల్లె శీను, శివగౌడ్, కోశాధికారి పడిగెల సురేందర్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు కలిగోట గంగాధర్, యామద్రిభాస్కర్ వారిని అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు అందించాలి



బోధన్/బోధన్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం పట్టణంలో ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మీసాలే నాగేష్, శివకుమార్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అన్నదాతల అరెస్టు సరికాదు



బోధన్: రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు వెళ్తున్న అన్నదాతలను అరెస్టు చేయడం సరికాదని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ తెలిపారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



వర్ని: గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మోస్రా ఎంపీడీవో కార్యాలయం ఎదుట కూలీలు, సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 200 పని దినాలు కల్పిస్తూ రోజుకు 600 రూపాయల కూలీ ఇవ్వాలని, వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయవద్దని డిమాండ్ చేశారు. అలాగే కూలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు పెద్ది వెంకట రాములు, నారా శంకర్, మేకల మల్లేష్, బుర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు అభినందించారు.

జోరుగా బెల్టు దందా

- డొంకేశ్వర్ మండలంలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు
- పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ అధికారులు



అన్నారంలో కొనసాగుతున్న బెల్టు షాప్

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలో బెల్టు షాపుల దందా జోరుగా నడుస్తోంది. గ్రామానికో దుకాణం ఏర్పాటు చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. నిర్వాహకులు ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల దాకా లిక్కర్‌ను అమ్ముతున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు 'మామూలు'గా తీసుకోవడంతో వ్యాపారులు దందాను దర్జాగా కొనసాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

డొంకేశ్వర్ మండల కేంద్రంలో అధికారిక వైన్స్ ఉండగానే తొండాకూర్, దత్తాపూర్, కోమట్‌పల్లి, నికాల్‌పూర్, అన్నారం, సిర్పూరం, జీజీ నడ్కుడ, గాదేపల్లి, మారంపల్లి, గంగాసముందర్ గ్రామాల్లో వేలం పాట ద్వారా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నందిపేట్, డొంకేశ్వర్ వైన్సుల నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి బెల్టు దుకాణాల్లో ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. వైన్సుల మాదిరిగా షాపులు పెట్టి మందుబాబుల కోసం రేకులతో పర్మిట్ రూములు పెట్టి వసతులు కల్పిస్తున్నారు. దీంతో అక్కడే సిట్టింగులు నడుస్తున్నాయి. దీనికి తోడుగా పేకాట కూడా కొనసాగుతోంది. ఈ బెల్టుషాపులు రోడ్ల పక్కనే ఉన్నప్పటికీ ఏ అధికారి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

కల్తీ చేసి ఎక్కువ రేటుకు...

బెల్టు దుకాణాల నిర్వాహకులు అధిక లాభాలు అర్జించడానికి మద్యాన్ని కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వైన్సుల నుంచి తెస్తున్న లిక్కర్, క్వాటర్, హాఫ్ ఏదైనా సరే ఆ బాటిళ్ల సీళ్లను తెలివిగా ఓపెన్‌చేసి రెండు బాటిళ్లను మూడుగా చేస్తున్నారనేది ఎవరికీ తెలియని రహస్యం. కాగా, ఒక్కో లిక్కర్ బాటిల్‌పై అదనంగా రూ. 20 వరకు వసూల్ చేస్తున్నారు. ఈ కల్తీ మద్యాన్ని తాగిన మందుబాబులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎనీ టైం మద్యం దొరకడంతో యువత కూడా పెడదోవ పడుతోంది. మత్తు ఎక్కువై బెల్టు దుకాణాల్లోనే పడిపోతున్నారు. తాగిన మైకంలో గొడవలు పెట్టుకుని కొట్టుకున్న సందర్భాలు కూడా చాల ఉన్నాయని చెప్పవచ్చు. పోలీసులకు, ఎక్సైజ్ అధికారులు వీటిని నియంత్రించాల్సింది పోయి దర్జాగా బెల్టు దుకాణాల ముందే తమ వాహనాలు ఆపి మరీ మామూళ్లను పట్టుకెళ్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వారి సహకారం ఉండటంతో నిబంధలనకు విరుద్ధమైన బెల్టు దుకాణాలను ధైర్యంగా నడిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్తీ మద్యాన్ని నివారించి, మద్యం విక్రయాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మల్లన్నగుట్ట రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



కొనసాగుతున్న రోడ్డు పనులు

బాల్కొండ: మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి 44 నుంచి మల్లన్నగుట్ట వరకు గల రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పనులు నిలిచి పోవడంతో సోమవారం 'సాక్షి' దినపత్రిలో 'మల్లన్నా.. నీ గుట్టకు ఎట్టా రావలన్నా' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు. జాతీయ రహదారి నుంచి గుట్ట వరకు తారు రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.2.65 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభించి, కంకర వేసి వదిలేశారు. ఈ నెల 23 నుంచి జరిగే మల్లన్న ఉత్సవాలకు భక్తులు వెళ్లడం ఇబ్బందిగా మారడంతో భక్తుల ఆవేదనను సాక్షి దినపత్రిక కళ్లకు కట్టినట్లు చూపడంతో అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. ఉత్సవాల నాటికి తారు వేస్తామని అధికారులు తెలిపారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలి



డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్: తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో మంగళవారం ఎంపీడీవో క్రాంతి అధ్యక్షతన జరిగిన కార్యకరమానికి జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిసరాల శుభ్రతతో పాటు గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలన్నారు. అతిసార వంటి వ్యాధులు నీటి కలుషితం వల్ల వస్తాయన్నారు.

ప్రతి గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం డ్రెయినేజీలను జెడ్పీ చైర్మన్ శుభ్రం చేసి, ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. మండల స్పెషల్ అధికారి ముత్తెన్న, ఎంపీటీసీ సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న ఏసీపీ

బోధన్: రోడ్డు భద్రత నియమాలను వాహనదారులు ఖచ్చితంగా పాటించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు డ్రైవర్లు సురక్షితంగా చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రమాదరహితంగా బస్సులు నడిపి, విధుల్లో ప్రతిభ చాటిన పలువురు డ్రైవర్లకు ప్రగతి చక్రం అవార్డులను అందించి, సత్కరించారు. బోధన్ ఎంవీఐ శోభన్, డిపో మేనేజర్ శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'భారత్ బంద్'ను విజయవంతం చేయాలి







మాక్లూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు.. కిసాన్‌నగర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు.. బోధన్‌లో..

బోధన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బంద్‌కు వ్యాపారులు, వాణిజ్య వర్గాల వారు సహకరించాలన్నారు. అనంతరం 'బంద్' వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్డీవో ఆఫీసులో అధికారికి సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ , రవాణా రంగ కార్మికులు, డ్రైవర్లు సమ్మె నోటీసు ఇచ్చారు. నాయకులు పోశెట్టి, అజ్జు, షేక్ మోయిన్, జహీర్, షేక్ హుస్సెన్ పాల్గొన్నారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్: మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డుగంగాధర్ వేర్వేరుగా విలేకరులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్‌బంద్‌లో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో మంగళవారం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న గ్రామీణ భారత్ బంద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను గ్రామీణ బంద్‌ను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. నాయకులు నజీర్, ఫయాజ్, రాజేశ్వర్, ఉమేశ్, వినోద్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, కష్టపడి చదవాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ ఆకాంక్షించారు. చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాందాస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఫౌండేషన్ సొసైటీని ప్రారంభించారు. కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై సొసైటీ లోగోను ఆవిష్కరించిచ మాట్లాడారు. సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు ఈరవత్రి రాజశేఖర్, తల్లితండ్రులు ఈరవత్రి రాందాస్, నర్మద, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎంఈవో రాజ గంగారాం, హెచ్ఎం చేతన కుమారి, మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, వీడీసీ అధ్యక్షుడు రిక్కల గంగా రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు ఏ విటమిన్ పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): కొటార్మూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు ఏ విటమిన్‌ను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తార, ఆశా వర్కర్లు సంతోష, కవిత, నర్సమ్మ, లావణ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మాక్లూర్: గుజరాత్‌లో త్వరలో జరుగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కేజీబీవీ విద్యార్థిని నికిత ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం కేజీబీవీ ప్రత్యేక అధికారిని సిహెచ్ ప్రగతి విద్యార్థినిని అభినందించారు. ఉపాధ్యాయులు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ బదిలీయ్యారు. ఆయన స్థానంలో మహబూబబాద్ జిల్లా మరిపెడ్డ మున్సిపల్ కమిషనర్ రాజు ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. ప్రసాద్‌చౌహాన్ సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయనకు వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్లు సన్మానించారు.



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మంగళవారం బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఆయన ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బ దిలీ కాగా.. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

రుద్రూర్ ఎంపీడీవో..

రుద్రూర్: మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాల గంగాధర్ అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో మండల పంచాయతీ అధికారి సాయిలుకు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



రెంజల్(బోధన్): రెంజల్ హైస్కూల్, ఆదర్శ పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను జెడ్పీటీసీ మేక విజయ సంతోష్ పంపిణీ చేశారు. హెచ్ఎంలు ఆంజనేయులు, బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు వాటర్ బాటిళ్లు..



రెంజల్(బోధన్): కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న పలువురు భక్తులకు మంగళవారం తాడ్‌బిలోలి వద్ద మాజీ ఎంపీటీసీ ఆష్టం శ్రీనివాస్ వారికి వాటర్‌బాటిళ్లు, ఎనర్జీ డ్రింక్‌లను అందించారు. నాయకులు సాయరెడ్డి, మౌలానా తదితరులున్నారు.

హెచ్ఎంకు ఘనంగా వీడ్కోలు



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విజయ్‌కుమార్ బదిలీపై వెళ్లగా, మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఆయనను ఘనంగా సన్మానించారు. నాయకులు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అనాస్ ఒలంపియాడ్ పరీక్షలో జిల్లా ప్రథమ స్థానం సాధించాడు. అనాస్ చందూర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ప్రిన్సిపాల్ నరేశకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని గాదేపల్లి మాజీ సర్పంచ్ నక్కల భూమేశ్‌ను మంగళవా రం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, వి ద్యార్థులు సన్మానించారు. బడి అభ్యున్నతి కో సం భూమేశ్ కృషిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎంలు రాజన్న, రాజేశ్వర్ ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



ఆర్మూర్: నందిపేట్ మండలంలోని చౌడమ్మ కొండూరులో మంగళవారం మృతిచెందిన గోమాతకు యజమాని అంత్య లోకం లక్ష్మీనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో బోరు మోటార్‌లను జెడ్పీటీసీ రాకేశ్‌చంద్ర మంగళవారం ప్రారంభించారు. సొసైటి చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు శ్యాంరావు, రాజ్‌కుమార్, ఆమోస్, యాల్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

బోధన్‌టౌన్(బోధన్): ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘం డివిజన్ నాయకులు సాయికుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్తిక్, శివాజీ, పవన్, రాకేష్ తదితరులు ఉన్నారు.

బధిర విద్యార్థులను ప్రోత్సహించాలి



ఆర్మూర్‌లో బధిర విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

ఆర్మూర్: బధిర విద్యార్థులను వికలాంగులుగా చూడకుండా విశిష్ట ప్రతిభా వంతులుగా గుర్తించి వారిలోని ప్రతిభను ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావ్ సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హియర్‌ఎస్ యూ అనే స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బధిర విద్యార్థుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఎంఈవో రాజ గంగారాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. అనంతరం హియర్‌ఎస్ యూ సంస్థ సోషల్ ఇంపాక్ట్ కోఆర్డినేటర్స్ కుల్దీప్, రోహన్, సాహిల్ సుమారు 130 మంది బధిర విద్యార్థులను పరీక్షించి లబ్ధిదారులను గుర్తించారు. వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఐఈఆర్టీలు కిషన్, లింబాద్రి స్వామి, నగేష్ గౌడ్, రాజన్న, సునీల్, సురేష్, సాగర్, జలంధర్, కిషన్, మౌలిక, గౌతమి, మానస, మమత, ప్రసాద్, మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ముస్తాబైన ఆలయాలు



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో గల సా యిబా బా ఆలయం, మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరం, ముప్కాల్ మండలం వేంపల్లిలోని హ నుమాన్ ఆలయం బుధవారం నిర్వహించే వార్షికోత్సవాలకు ముస్తాబయ్యాయి. నేడు వసంత పంచమి వేడుకలతోపాటు ఆలయ వార్షికోత్సవాలు, అన్నదానాలను నిర్వహించుటకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు. మెండోరాలో వేంకటేశ్వరుని కల్యాణోత్సవం నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలి రావాలని నిర్వాహకులు కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లాల్ సలామ్ (తెలుగు) – 11.30 కెమెరామెన్ (తెలుగు) – 2.45 ఓయ్ (తెలుగు) 6.00 బేబి 9.30

స్క్రీన్-2 – ఈగల్ (తెలుగు) – 11.30, 03.00, 6.30, 9.50

స్క్రీన్-3 – యాత్ర-2 (తెలుగు) – 1.00, 7.05, 10.00 తేరి బాతోమే (హిందీ) 3.55

స్క్రీన్-4 – ట్రూ లవర్ (తెలుగు) – 12.00 లాల్ సలామ్ (తెలుగు) – 3.05 హనుమాన్ (తెలుగు) – 6.20, 9.40

అయోధ్యకు తరలిన బీజేపీ నాయకులు



వేల్పూర్/బాల్కొండ/ఆర్మూర్‌టౌన్: బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి పలువురు బీజేపీ నాయకులు, కరసేవకులు మంగళవారం అయోధ్యకు తరలివెళ్లారు. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో వారు అయోధ్యకు వెళ్లారు.



